# త్రిశంకు స్వర్గం

సి. విమలా గణేష్

"చీర కట్టడమంటే, నా కసహ్యం, అమ్మలా" ముఖం చిట్లించుకొని వింతగా చూస్తూ అంది నెలవంక.

"గుడ్. చీరకట్టవు గనుకే నువ్వంటే నాకిష్టం. యీ డ్రస్సులో నీ పర్సనాలిటీ రియల్లీ, వండర్‌ఫుల్" తన్మయత్వంలో పలికాడు, ప్యాంటూ, షర్టు వేసుకొని శిల్పంలా నిలబడిన నెలవంకను దగ్గర చేసుకుంటూ, బ్యూటీ. అతని అసలు పేరు మదన్. కానీ అతన్ని అందరూ 'బ్యూటీ' అనే పిలుస్తారు.

"మరీ పొగడకు" అతని కళ్ళలోకి లోతుగా చూస్తూ పలికింది నెలవంక.

"నేనేం పొగడటంలేదు" మృదువైన బుగ్గల్ని రాస్తూ తదేకంగా చూస్తూ అన్నాడు బ్యూటీ.

"నీకంటేనా! ఆ కళ్ళూ, ముక్కు- చిలిపిగా నవ్వే ఆ పెదాలూ- నిజంగా నువ్వు-" అతని ముక్కు- గట్టిగా లాగి నవ్వింది నెలవంక.

"నిజంగా- నేను అడిగే ప్రశ్న పూర్తి చెయ్యకుండా ఆపేశావేం?" మత్తుగా చూశాయి కళ్ళు.

"చెప్పను."

"నెలా! మనం..."

"ఆఁ, మనం?"

"అదే, కాశ్మీర్ ప్రోగ్రాం...?"

"ఆగండి సార్! కాస్త ఓపికపట్టాలి."

"ఎందుకనో?"

"ప్రపోజల్ యింకా డాడీదాకా వెళ్ళలేదు గనుక."

"ఒప్పుకుంటారా?"

"ఏమిటా చచ్చు ప్రశ్న?"

"అదికాదు నెలవంకా..."

"అర్థమయింది తమరి భావం. మా నాన్న పాతకాలంవాడు కాదు. మోడరన్ యుగం! అలాంటి పట్టింపులేమీ లేవు. నా స్వతంత్రానికి ఎప్పుడూ అడ్డురారు.

తెలిసిందా!" గర్వంగా చూసింది.

"నిజంగా గొప్పవారే!" నెలవంకను దగ్గర చేసుకొంటూ అన్నాడు.

నెలవంక చాలా డబ్బుగలవారి ఏకైక సంతానం. తండ్రి చంద్రశేఖరం. ఇంజనీరుగా చాలా గడించాడు. తల్లి సత్యవ్రత పూజలతోనే కాలం గడుపుతుంది. ఇక నెలవంక మోడరన్‌గా పెరిగింది. ఆకాశంలోని చందమామనైనా తెచ్చి ఇవ్వగల తండ్రి! తన కోసం ప్రత్యేకించి కారు. కాలేజీ పేరుతో సినిమాలూ, షికార్లూ, బాయ్ ఫ్రెండ్స్.

చాలామంది మగవారితో స్నేహం చేసే నెలవంక కాలేజీ 'బ్యూటీ'గా పేరు పొందిన మదనంటే వచ్చే వ్యామోహం అతనితో సరదాగా తిరగటంతోపాటు టూర్లు కూడా వెళుతుంది, ఇంటికి కూడా తీసుకొస్తుంది. తల్లికి ఇష్టం లేక పోయినా, నాగరికత పేరుతో చంద్రశేఖరం నోరు మూయిస్తాడు సత్యవ్రతను.

చీరలు కట్టదు. రకరకాల డ్రస్సులతో అల్ట్రామాడ్రన్‌గా వుంటుంది.

నెలవంకకు. మదన్ అందగాడని క్రేజ్

మదన్‌కు, నెలవంక ఆస్తిపై మోజు.

అసలు నెలవంక ఆలోచనలే వేరు. 'ప్రేమా, పెళ్ళి' యీ రెండింటిలో 'ప్రేమే' ముఖ్యమంటుంది. అలానే పెళ్ళికి ముందు ఆనందం అనుభవించటం తప్పు లేదంటుంది. బాయ్‌ఫ్రెండ్స్ చాలా అవసరమంటుంది. ఇక ప్రేమించిన వాడితోనే జీవితం పంచుకోవాలనే రూలు వున్నట్లు కనిపించదు ఆమెకు.

* *

గాయత్రి మధ్యతరగతి కుటుంబానికి చెందిన పిల్ల. అందమైన పర్సనాలిటీ. తండ్రి రాజారాం, ఓ చిన్న వుద్యోగి. తల్లి శ్యామలాంబ ఇల్లు వదిలి బైటకు రాదు. గాయత్రి కాలేజీలో చేరింది. గాయత్రిని కాలేజీలో చేర్పించటానికి కారణం, ప్రస్తుతం పెళ్ళి చేయగల తాహతు లేదు గనుక. 'ఇంట్లో కూర్చొని ఏం చేస్తాను. చదువుకుంటానని' గోల చేసి మరీ చేరింది గాయత్రి. తల్లికి ఇష్టంలేకపోయినా గాయత్రి మనసు అర్థంచేసుకున్న తండ్రి కాలేజీలో చేర్పించాడు.

"మన ఇంటా-వంటా ఆడది గడప దాటటంలేదు అంటే, కాలేజీ పోకటా!" కాస్త కోపంగా చూసింది శ్యామలాంబ.

"పోనీలేవే. ఏదో ఆశపడింది" రాజారాం సర్దిచెప్పాడు.

"మంచివాణ్ని చూసి. ఓ అయ్య చేతిలో పెడితే మన బాధ్యత తీరిపోతుంది."

"కరక్టు."

"చాల్లెండి. నేనేది చెప్పినా మీకు హాస్యంగానే వుంటుంది."

"హాస్యం కాదోయ్. నువ్వన్నది నిజమే. గాయత్రిని ఓ అయ్య చేతిలో

పెట్టాలని వాళు మాత్రం లేదూ? కానీ ఏం చెయ్యను. ఏ పెధవను కదిలించినా ఏమంటున్నాడు..."

"........."

"వాళ్ళడిగేది అమ్మాయి అంద చందాలూ, కుటుంబ మంచి-చెడ్డలు కాదోయ్.

"కట్నమెంత? యిదీ వరస. సంబంధం చూడండి అని కదిపితే చాలు... 'ఎంత రేటులో చూడమంటారూ?' ఎదురు ప్రశ్న. సాంప్రదాయానికి విలువనిచ్చే రోజులు పోయాయి. డబ్బు ముఖ్యం. అదిలేని మనబోటివాళ్ళు, కాలం తల్లటమే కష్టం" నీరసంగా చూశారు.

"అంతేనంటారా?"

"అంతే మరి!"

"నన్ను మా అమ్మ పెద్దదాన్నయ్యాక గడప కదలనిచ్చేది కాదు."

"ఔను! ఆనాడు గడపదాటితే తప్పు. ఈనాడు గడప దాటకపోతే తప్పు. కాలం అలా తగలబడింది."

"కాలం ఏం చేసిందండీ?"

"కాలం కాకపోతే, సూపర్ తిండి తిన్న మనుష్యుల స్వభావమే అనుకో."

"ఇంతకూ- అది-" నసిగింది.

"కాలేజీకి వెళ్ళవలసిందే."

"ఏమిటో, పదిమందిలో తిరగటం నాకేం నచ్చలేదు సుమా" తనలో తనే మాట్లాడుకుంటుంది శ్యామలాంబ. భార్య చెప్పేది తప్పనలేదు రాజారాం. అతని ఆలోచన కూడా అదే. ఆడపిల్లకు నాలుగు అక్షరాలు నేర్పించటం, చిన్నవయసులోనే ఓ అయ్య చేతికి అప్పగించటం. కానీ- కట్నాల సమస్య అతని చేతులకు బేడీలు వేసింది.

స్నానం ముగించి తనకున్నవాటిల్లో కాస్త మంచి వాయిల్ చీర కట్టుకుంది గాయత్రి. సహజంగానే గాయత్రి అందమైనది. కృత్రిమ అలంకారాలు లేపీ గాయత్రికి అవసరంలేదు.

"ఇలా రా జెడ వేస్తా" పమిట చెంగుతో ముఖం తుడుచుకుంటూ పిలిచింది శ్యామలాంబగారు.

తల చిక్కు తీస్తుంది. గాయత్రిని 'పెద్దపాపా' అనే పిలుస్తారు యింట్లో.

"పెద్దపాపా! నేను చెప్పేది శ్రద్ధగా విను"

"చెప్పమ్మా."

"యింతవరకూ అటూ ఇటూ చూసినా మన ఇంట్లో పెద్దదానివై బైటకెళుతున్న మొదటి పిల్లవు నువ్వు. జాగ్రత్తగా మసులుకో. తలదించుకొనే వెళ్ళాలి. యిక్కడ తల కాలేజీలో మళ్ళీ యింట్లో తల ఎత్తాలి. మగవాళ్ళతో మాట్లాడకూడదు. అసలు ఎవరితో నూ స్నేహాన్ని పెంచుకోకు. ఫలానావారి అమ్మాయి నిప్పు అనాలే గానీ..." మాట్లాడలేకపోయింది.

"అలాగేనమ్మా."

"వంటికొచ్చిన వ్యాధి మాస్తుంది



కావి- కానీ వంశానికొచ్చిన మచ్చ ఎన్ని తరాలయినా మాయదు. గుర్తుంచుకో" కంఠంలో కాస్త జీర కనిపించింది

తల్లి ఆవేదన అర్థం చేసుకున్న గాయత్రి లేచింది.

గాయత్రి కాలేజీలో ఎవరితోనూ ఎక్కువ మాట్లాడదు తన ఆలోచన అంతా చదువుమీదే. కాలేజీ అయిపోయిన వెంటనే పావుగంటలో ఇల్లుచేరి, ఇంటి పనుల్లో తల్లికి సాయపడుతుంది.

"నాన్నా!" నెమ్మదిగా పిలిచింది గాయత్రి.

"ఏమ్మా!"

"కాలేజీ-" నాన్చింది.

"ఓ- ఫీజు కట్టాలి కదూ!"

"ఔను!"

"టైం వుందా?"

"లేదు నాన్నా. నోటీస్ బోర్డులో-" తలదించుకుంది.

"పేరు పెట్టారా? కట్టలేదని."

"..." తలవూపింది ఔనన్నట్లు.

"పరేసమ్మా- రేపు ఎలా అయినా కట్టేద్దువుగాని."

గాయత్రి పుస్తకాలు తీసుకొని వెళ్ళిపోయింది. "భగవంతుడా! ఏమిటీ అన్యాయం? కులాన్నిబట్టిగాక కుటుంబ

స్థితిగతులనుబట్టి ప్రభుత్వం సాయపడే దెప్పుడు? అసలు ఆ రోజు వస్తుందా?" ఆలోచనలు బుర్రను పాడుచేస్తుంటే, చిరిగిన చీరచెంగు కనపడనివ్వకుండా కాలేజీకి నడుస్తుంది గాయత్రి.

బాగా చదువుకొని మంచి వుద్యోగం సంపాదించుకొని, తల్లిదండ్రులకు సాయపడాలన్నదే గాయత్రి ఉద్దేశం.

గాయత్రి, నెలవంకా ఒకే కాలేజీలో చదువుతున్నా, యిద్దరి మధ్యా వ్యత్యాసం చాలా- చాలా.

* * *

అదే కాలేజీలో గదులన్నీ శుభ్రం చేసి నీళ్ళుపట్టే నరసమ్మకు ఆరోగ్యం బాగోని కారణంగా, నరసమ్మ కూతురు ఎంకి ఆ పనికి నియమించబడింది. రోజూ చీకటితోనే కాలేజీకి తండ్రి తోడుగా వచ్చి గదులన్నీ శుభ్రంచేసి, మొక్కలకు నీళ్ళు పెట్టి ఇంటికి వెళుతుంది ఎంకి. ఎంకికి వయసు పదహారు కంటే ఎక్కువ ఉండదు. యవ్వనంలో బిగువుగా కనిపిస్తుంది. ముఖంలో కళ వుంది. అక్కడక్కడ చిరిగిన బట్టలే కట్టుకుంటుంది. కాస్త తలదువ్వి మంచి బట్టలు వేసుకుంటే ఎంకి ఆ కాలేజీలో చదివే అందగత్తెల లిస్టులో చేరుతుంది.

ఎంకి యవ్వనం పసిగట్టిన విద్యార్థుల బృందంలో కొందరు ఎంకిపై మన్మధబాణాలు ప్రారంభించారు. ఎంకి మొదట్లో గమనించకపోయినా, తర్వాత గమనించింది. పదిగంటలకు కూడా సరిగా క్లాసుకురాని రవి ఉదయం ఎనిమిది గంటలకే ఎంకికోసం వచ్చాడు.

వారం రోజులుగా రావటం ఎంకిని చూడటం గమనించింది ఎంకి.

"నీ పేరు?" రవి ప్రశ్న.

"ఎంకి, బాబుగారూ" వినయంగా ఎంకి సమాధానం.

"నువ్వు చాలా అందంగా వుంటావు" మత్తు చూపులు,

"మీకంటేనా బాబుగారూ," చిరునవ్వు.

"ఏం అలా చిరిగిన బట్టలు వేసుకుంటావు?"

"బాగుంది బాబుగారూ, మంచిబట్టల కెక్కడి కెల్లాలి?"

"అంటే?"

"తిండికేనేదు. మళ్లీ బట్టలా? మా అమ్మకి...పదిమందిమి."

"చెప్పకూ...చెప్పకు. ఇంద" వంద రూపాయల నోటు అందించాడు.

"నాకా బాబూ?"

"పరవాలా తీసుకో" ఎంకిచేయి పట్టుకొని బలవంతాన చేతిలో పెట్టాడు.

"రేపు..."

"ఆఁ రేపు...?"

"ఆరుగంటలకల్లా చక్కగా స్నానం చేసి, మంచి బట్టలేసుకొని రాణిలా రావాలి ఎక్కడికో తెలుసా?"

ఎక్కడికన్నట్లు చూసింది.



"అదే......" అంటూ చెవిలో చెప్పాడు రావలసినచోటు.

"వస్తావు కదూ?"

"ఆఁ..." 'బాబుగారేమిటి? నన్ను రమ్మంటమేమిటి? అటువంటి గొప్పోరు పిలవటం' మనసులోనే అనుకొని చేతిలోని వందరూపాయలు చూసుకొని మురిసిపోయింది ఎంకి.

మరుసటిరోజు ఆరు గంటలకల్లా రంభలా కాకపోయినా చక్కగా అలంకరించుకొని రవి చెప్పిన చోటు చేరింది, ఎంకి.

"గుడ్. యిలా ఉండాలి" రవి పట్టుకి ఎంకి అతదికి బానిసయింది. రవితో మొదలైన ఎంకి జీవితంలోకి...రాఘవ విశ్వం, యింకా ఎందరెందరో...

* * *

నెలవంక చదువు పూర్తయింది. చూడవలసిన ప్రదేశాలూ, అనుభవించవలసిన సుఖం మత్తుగా బ్యూటీతో దవి చూపింది. పెళ్ళి ప్రశ్న తలెత్తింది.

"అమ్మా, నెలవంకా! ఓ రిక్వెస్టు" చంద్రశేఖరంగారు నెలవంక టిఫిన్ చేస్తూండగా దగ్గరగా వచ్చి అన్నారు.

"చెప్పండి డాడీ" తండ్రివంక చూడకుండానే అంది.

"ఏం లేదమ్మా. నా స్నేహితుడు... అదే సుభాష్, ఈవేళ వస్తున్నాడు."

"అలాగా!"

"దేనికని అడగవేమ్మా?"

"చెప్పండి డాడీ."

"వాళ్ళబ్బాయితో వస్తున్నాడమ్మా."

"దేనికి డాడీ?"

"గుడ్. అలా అడగాలి. సుమన్ అమెరికాలో సెటిలయ్యాడు. డాక్టరుగా పేరుతోపాటూ, డబ్బు కూడా సంపాదించి చెప్పలేని ఎత్తుకు ఎదిగాడు. సుభాష్ నిన్ను కోడలుగా చేసుకోవాలని ఆశపడు

తున్నాడు...వాళ్ళకు నువ్వు అన్ని విధాలుగా నచ్చావట. అబ్బాయి...నీకు నచ్చితే, నాకూ సమ్మతం."

"..............."

"మాట్లాడవేమ్మా?"

"ఏం మాట్లాడను డాడీ?"

"అదేనమ్మా...పెళ్ళి గురించి!"

"ముందు వాళ్ళను రానివ్వండి. తరువాత ఆలోచిద్దాం."

"గుడ్ అలా చెప్పాలి."

అనుకున్న విధంగానే వచ్చారు పెళ్ళివారు. పెళ్ళిచూపుల్లా కాకుండా ఫ్రెండ్లీగా జరిగాయి.

పెళ్ళికొడుకు సుమన్ పద్ధతులు 'స్త్రీ స్వాతంత్ర్యానికి' ఇచ్చే గౌరవం అన్నీ నచ్చాయి నెలవంకకు. నెలవంక మోడరన్ డ్రెస్, ఆస్తీ, అంతస్తూ అబ్బాయికి నచ్చాయి.

నెలవంక పెళ్ళి అతి వైభవంగా సుమన్‌తో జరిగింది. పెళ్ళికి అతిథిగా అందరి ఫ్రెండ్స్‌తో పాటూ బ్యూటీని పరిచయం కూడా చేసింది నెలవంక.

* * *

కార్య బోధపడలేక రాజారాం గాయత్రికోసం చాలా సంబంధాలు వెదికాడు. ఏదీ కలిసిరాలేదు.

"ఎలాగయినా చెప్పి చూడరా!" అతి మాలే ధోరణితో తన స్నేహితుణ్ణి అడిగాడు రాజారాం.

"ఏంచేసేదిరా? కట్నం వారి రేంజికి పైసా తగ్గినా. వాళ్ళు వొప్పుకునే విధంగా లేరురా."

"అంతేనంటావా?"

"అంతేరా, అంతే. లోకం పాడయిపోయింది. నీ కూతురు అందాలబొమ్మ. చదువుకుంది. సంస్కారముంది. మీ వంశం విప్రు! కానీ...అదికాదురా ఆడపిల్ల పెళ్ళికి ముఖ్యం! డబ్బురా, డబ్బు" కోపంగా అన్నాడు చలం.

* * *

ఎంకి యవ్వనంతో చాలామంది ఆటలాడుకున్నారు. ఎంకి ముందులా కవ్వించటంలేదు. యవ్వనం వొంపుసొంపులు అంతగా లేవిప్పుడు.

ఎంకిని చిన్నవయసు నుంచి పెళ్ళాడలని వున్న బావకు, ఎంకి వ్యవహారం పూర్తిగా తెలిసిపోయింది.

"ముహూర్తం పెట్టిస్తే, అదే దారికొస్తాది" బావ రంగడు ఊరడించాడు. ఎంకి అమ్మను.

"దారికొస్తాదంటావా?"

"రాకేంచేస్తాది" ఆ రాత్రి ఎంకిని రంగడు మనువాడటానికి ఒప్పుకున్నాడని తెలిసి చాలా సంబరపడింది...అయినా భయం.

"బావా!" పిలిచింది ఎంకి.

"ఏందే?"

"నన్ను మనువాడతానంటివంట."

"ఔనే దానికేం?"

"అదికాదు మామా..."

"నాకంతా తెలుసు! బయపడక. కాలి కట్టాక సరిగ్గుండు, తెలిసిందా?" కళ్ళల్లో కోపంలేదు. చిరునవ్వు తప్ప

"నిజంగా నేనెంత పుణ్యం చేసుకుంటినో" మురిసిపోతూ పరుగెత్తింది, కొత్త పెళ్ళికూతురు ఎంకి.

* * *

"ఏమిటీ తేడా? అటు పై క్లాసులో, ఇటు లో క్లాసులో ఒకటి డబ్బు, రెండోది అంతగా పట్టించుకోని అమాయకత్వం! మరి మధ్యతరగతిలో...? అదంతేనా? అంధకారంలో మగ్గవలసిందేనా? డబ్బు కున్న విలువా-గౌరవం, మంచితనానికీ, మానమర్యాదలకూ లేవా? డబ్బా-పోడా దేనినయినా కప్పగలుగుతుందా? డబ్బులేని పేద...అదే 'మధ్యతరగతి' వారి గతి ఇంతేనా? ఇక మార్పు రాదా?

* * *


